లోక రక్షకుడికి జేజేలు

- అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆకట్టుకున్న ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు



అవనిగడ్డ ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు జననం సెట్టింగ్

మచిలీపట్నంటౌన్: లోక రక్షకుడు ఏసుక్రీస్తుకు విశ్వాసులు జేజేలు పలికారు. అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో సోమవారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధ రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాయిద్యాలు, టపాసులను కాలుస్తూ సందడి చేశారు. తెల్లవారుజాము నుంచే పలు చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో భక్తిగీతాల ఆలాపన, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ఆనందంగా గడిపారు. ఆయా చర్చిల పాస్టర్లు, ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన పాస్టర్లు క్రిస్మస్ విశిష్టతను వివరించారు. నగరంలోని తెలుగు చర్చిలో వికార్ సీఎల్ జాస్పర్, పాస్టర్ ప్రసాదరావు దేవుని వర్తమానం అందించారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) చర్చికి వచ్చిన క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పరాసుపేటలోని ఆర్సీఎం చర్చిలో ఫాదర్ స్వామినాథం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ స్వామినాథంతో కలసి పేర్ని కిట్టు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నోబుల్ కాలనీలోని నోబుల్ ప్యారిస్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పేర్ని కిట్టు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శారదానగర్ చర్చిలో ఫాదర్ జానీ డిక్రూజ్‌తో కలిసి కేక్ కట్ చేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ దేవుడి ఆశీస్సులతో మచిలీపట్నంలో మెడికల్ కాలేజీ, బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్టులతో పాటు పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రార్థనల్లో కిట్టుతో పాటు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు, బందరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాడెల్లి దేవిడ్‌శామ్యూల్, వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్‌నోబుల్, కార్పొరేటర్‌లు మాచవరపు రాంప్రసాద్, యంద్రపాటి నాగేశ్వరరావు, మీర్ అస్గర్‌అలీ, గోపిశెట్టి సతీష్, ఐనం తాతారావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, బూరగ రామారావు, షేక్ మొహమ్మద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మల్కాపట్నంలోని ఎల్‌ఈఎఫ్ చర్చి, ఇండియన్ పెంతుకోస్తల్ చర్చి, బెతేలు చర్చి, బైపాస్ రోడ్డులోని జీజీఎం చర్చి, డ్రైవర్స్ కాలనీలోని చర్చిల్లో పాస్టర్లు టి.ప్రభాకరరావు, ఫిన్నీశామ్యూల్, ఎస్.వాల్టర్స్ పరంజ్యోతి, తేళ్ల భక్తపాల్, విజయవాడ రోడ్డులోని చర్చిలో పాస్టర్ బొకినాల అబ్రహం వాక్య పరిచర్య చేశారు. పలు చర్చిల్లో పాస్టర్‌లు పెద్దలు, పిన్నలకు బాప్తిజం ఇచ్చారు.

క్రీస్తు బోధనలే సమాజానికి స్ఫూర్తి

నాగాయలంక: క్రిస్మస్ సందర్భంగా ఆదివారం అర్ధ రాత్రి నుంచి నాగాయలంక మండలంలో వాడవాడలా బాల ఏసు ఆగమన సమయ సంబరాలు ప్రత్యేక ప్రార్థనలు, మధురగీతాలు ఘనంగా జరిగాయి. క్రీస్తు బోధనలే నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు సందేశాల్లో వినిపించారు. నాగాయలంకలోని ప్రధాన ఆర్‌సీఎం చర్చి, ఆ ప్రాంగణంలోని మేరీమాత విగ్రహాలను విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. డేగలపాలెం నెహేమియా మినిస్ట్రీస్ చర్చిలో దైవజనులు పాల్ నెహేమియా, సుకన్యా పాల్ ఆధ్వర్యంలో అనాథ బాలలకు నూతన దుస్తులు బహూకరించారు. ఎదురుమొండిలో ఆల్మైటీ గాడ్ చర్చ్ మినిస్ట్రీస్ (ఏజీసీఎం)అధినేత చిట్టా రారాజు ఆధ్వర్యంలో పాస్టర్ జాన్ చక్రవర్తి పరిచర్యలో వేడుక జరిగింది. నాగాయలంక షెకీనా మినిస్ట్రీస్ చర్చిలో పూషడపు ప్రభుకుమారి, మండల పాస్టర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు మండలి కిరణ్‌బాబు ఆధ్వర్యంలో పలుచోట్ల క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. వక్కపట్లవారిపాలెం శివారు ఎన్టీఆర్ కాలనీలోని బాప్టిస్ట్ దేవాలయంలో రెవ.కొక్కిలిగడ్డ గాబ్రియేలు నేతృత్వంలో ఏసుప్రభువు సందేశాలు వినిపించారు. మర్రిపాలెంలో పి.ఏసురాజు చర్చిలో, నాగాయలంక రాజేశ్వరీ కాలనీలో రక్షణసైన్యం చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను ఇమ్మానియేల్, లక్ష్మీపురం పరిశుద్ధ ఆత్మ, సీతనపల్లి, తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

మచిలీపట్నంటౌన్: మల్కాపట్నం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు మేడికొండూరి మధుకర్, మేరీస్టెల్లా క్రిస్మస్ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మల్కాపట్నంలోని ఏసుక్రీస్తు విగ్రహం వద్ద ఫాదర్ పెదపూడి ఇమ్మానియేల్ ఆనంద్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో గంద్రపు శీనయ్య మాస్టారు, కొడాలి అజయ్‌కుమార్, బొకినాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెడనలో..



ప్రార్థనా మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

పెడన: పెడన తోటమూల ఆర్సీఎం చర్చి ఫాదర్ ఎస్.జోజప్పలు ప్రార్థనలు చేశారు. కొంకేపూడి చర్చిలతో పాటు పలుచోట్ల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఒకటో వార్డులోని ప్రార్థన మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు కేక్ కట్ చేసి చిన్నారులకు పంచారు. చిన్నారులు హారికకు కేక్ తినిపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పిచ్చిక సతీష్‌బాబు, బల్ల పద్మావతి, పాస్టర్ చిల్లిముంత లేమియేల్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: లక్ష్మీపురం శివారు సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ రెవరెండ్ ఎం.జోసఫ్ ప్రత్యేక ప్రార్థనలు, దివ్య బలిపూజ నిర్వహించారు. పురిటిగడ్డ గోల్డెన్ క్యాండిల్ చర్చిలో పాస్టర్ పరుచూరి జస్‌పాల్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ క్రీస్తు సందేశం అందించారు. నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెంలోని జీజీఎం చర్చిలో పాస్టర్ గోల్కొండ డేవిడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

కోడూరు: కృష్ణాపురం ఆర్సీఎం చర్చిలో విచారణ గురువులు విశ్వాసులకు ఏసు జననాన్ని వివరిస్తూ సందేశమిచ్చారు. రామకృష్ణాపురం, స్వతంత్రపురం, నాయుడుపేట, లింగారెడ్డిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు క్రిస్మస్ పర్వదిన విశిష్టతను వివరించారు. చర్చి ప్రాంగణాల్లో బాల ఏసు జననాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన పశువులపాకలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. టీఎస్సార్ గ్రూప్ ఆధ్వర్యాన నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌లు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రూప్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు, హరికృష్ణ, రామకృష్ణ పర్యవేక్షించారు.

వెంకటాపురం(మోపిదేవి): వెంకటాపురం సియోన్ గాస్పెల్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో అబ్బూరి విజయరాజు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సందేశం అందిస్తూ క్రీస్తు బోధనలు అనుసరించిన, ఆరాధించిన వారికి ఏసుక్రీస్తు ప్రేమను అందిస్తారని తెలిపారు. మోటుపల్లి శ్రీనివాసరావు, కోన శివ, అబ్బూరి జ్ఞానసుందరరావు పలువురు సేవకులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులోని షాలెం ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఏసురత్నం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ సంగా మధుసూదనరావు సంఘ సేవకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాలతో మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు చర్చిలకు వెళ్లి మిఠాయిలు పంపిణీ చేశారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ: మండలంలోని పలు ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ పరిధిలోని కోటగిరిలంక ఆర్‌సీఎం ప్రధాన చర్చిలో జరిగిన కార్యక్రమంలో విచారణ గురువు సురేష్ మెర్లో, హైదరాబాద్ మేత్రాసనం విచారణ గురువు గౌరుముచ్చు క్రీస్తురాజు కేక్ కట్ చేసి విశ్వాసులకు పంచారు. ఈ సందర్భంగా ఫాదర్ సురేష్ మాట్లాడుతూ మానవుల పాప పరిహారానికి ఏసుక్రీస్తు మానవ రూపంలో భూమి మీద జన్మించారని చెప్పారు.

కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక గుడిసెలో ఏర్పాటు చేసిన బాల ఏసు జననం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బందలాయిచెరువు, వేకనూరులో ఆర్‌సీఎం చర్చిల్లో జరిగిన వేడుకల్లో ఫాదర్ క్రీస్తురాజు, మోదుమూడి, స్థానిక 8వ వార్డులో జరిగిన వేడుకల్లో ఫాదర్ సురేష్ ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అవనిగడ్డలోని సీబీసీఎన్‌సీ, ఎల్‌ఈఎఫ్, పెంతెకోస్తు సంఘం, హోసన్నా మందిరంతో పాటు పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



శారదానగర్‌లో క్రిస్మస్ కేక్‌ను ఫాదర్ జానీ డిక్రూజ్‌తో కలిసి కట్ చేస్తున్న పేర్ని కిట్టు



కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఫాదర్స్ సురేష్, క్రీస్తురాజు



మల్కాపట్నం ఎల్‌ఈఎఫ్ చర్చిలో క్రిస్మస్ గీతాలను ఆలపిస్తున్న యువతులు



గూడూరులోని షాలెం ప్రార్థనా మందిరంలో..



ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ నృత్యాలు చేస్తున్న దృశ్యం



పరాసుపేట ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనల్లో క్రైస్తవులు



పెదప్రోలులో..

క్లుప్తంగా

రేపు ఆరుద్రోత్సవం

నాగాయలంక: మార్గశిర పాడ్యమి పురస్కరించుకుని స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో 27వ తేదీ బుధవారం ఆరుద్ర దర్శనోత్సవం(శివ ముక్కోటి) జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ సాంబశివరావు సోమవారం తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని చెప్పారు.

భక్తజన కోలాహలం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సోమవారం సెలవు దినం కావడంతో భక్తజన సందడితో ఆలయ ప్రాంగణం కనిపించింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విట్టంశెట్టి వెంకు మాస్టార్, సంఘ నాయకులు సత్యనారాయణ, ఉచిత పరిణయ వేదిక కన్వీనర్ నీలం ప్రసాద్, దివి సాయి, జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగా విగ్రహావిష్కరణ



నాగాయలంక: మండల శ్రీకనకదుర్గ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన కాపు ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావు విగ్రహం మంగళవారం ఆవిష్కరిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి) సోమవారం తెలిపారు. రంగా వర్ధంతి పురస్కరించుకుని మండల కేంద్రం నాగాయలంక బస్‌స్టాండ్ చౌరాస్తా కూడలిలో విగ్రహం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వృద్ధులు, వికలాంగులకు అన్న, వస్త్రదానం



నాగాయలంక: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యాన సోమవారం 40 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ, అన్నదానం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన దాతలు తలశిల సురేష్, అనూష దంపతులు తమ తల్లిదండ్రులు రామ్మోహనరావు, శాంతకుమారి జ్ఞాపకార్థం రూ.12వేలు సాయంతో వీటిని సమకూర్చారు. తొలుత ఆలయ అర్చకుడు కనగాల కుటుంబరావు ప్రత్యేక పూజలు చేశారు. పొన్నపల్లి లంకమ్మ, సబ్బినేని రాణి, ఆకురాతి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుడివాడ టౌన్: స్థానిక ఏజీకే హైస్కూల్‌లో జరిగిన టీచర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్–4 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈనెల 11వ తేదీ ప్రారంభమైన ఈ పోటీల్లో మొత్తం 9 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీల్లో విజేతలుగా కోటి నాగేశ్వరరావు, డి.చంద్రశేఖర్‌ల జట్టు వరుసగా 17–15, 17–14 పాయింట్లతో బీ శ్రీనివాసరావు, గుంటూరు ప్రసాదుల జట్టుపై విజయం సాధించింది. విజేతలకు ఖోఖో జాతీయ శిక్షకులు మడకా ప్రసాదు, డిప్యూటీ తహసీల్దార్ జె.సుబ్రహ్మణ్యం, సీనియర్ షటిల్ ప్లేయర్ పూజేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

కంకిపాడు: సెల్‌ఫోన్ దుకాణంలో జరిగిన చోరీ ఘటనపై సోమవారం కేసు నమోదైంది. కంకిపాడులో చుండూరు మణికంఠ ఎంటీఎం మొబైల్ దుకాణాన్ని నడుపుతున్నాడు. సోమవారం ఉదయం 11 గంటలకు దుకాణం తెరవడానికి వెళ్లి చూడగా, తాళం పగలకొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వివరాలు సేకరించారు. రూ. లక్ష విలువ చేసే 12 సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు దుకాణదారుడి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పైడమ్మా.. చల్లంగ చూడమ్మా..

నేటి నుంచి జనవరి 5వరకు పెడన పైడమ్మ జాతర



పెడనలో పైడమ్మ ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణ

పెడన: పైడమ్మ.. చల్లంగ చూడాలని కోరుతూ మంగళవారం నుంచి పెడన పైడమ్మ జాతర ప్రారంభం కానుంది. ఈ ఉత్సవాలు జనవరి ఐదో తేదీ వరకు జరగనున్నాయి. దీనికి దేవదాయశాఖతో పాటు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పోలీస్ శాఖ పటిష్ట చర్యలు ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలను అందించనున్నది. ఆలయ పరిసరాల చుట్టూ జెయింట్ వీల్స్, రంగులరాట్నం, బొమ్మల దుకాణాలు ఏర్పాట్లు చేస్తున్నారు. పైడమ్మ అమ్మవారు ఇప్పటికే రంగుల కోసం మచిలీపట్నం వెళ్లగా ఆమె తిరిగి 26న పెడనకు రానున్నారు. అమ్మవారు మచిలీపట్నంలో బయల్దేరినప్పటి నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభమనట్లు నిర్ణయిస్తారు. బంటుమిల్లి రోడ్డులోని కృష్ణమ్మ బావి వద్ద మెట్టినింటి (అత్తవారు) వంశీయులైన దాసు వారు మహానైవైద్యం సమర్పిస్తారు. అక్కడ నుంచి ముత్యాలమ్మ ఘటం వద్ద పుట్టింటి వారు తోట వంశీయులు అమ్మవారికి మహానైవైద్యాలను సమర్పిస్తారు. తిరిగి అమ్మవారిని కృష్ణమ్మ బావి వద్దకు తీసుకువెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు, మంగళహారతులు ఇచ్చి పైడమ్మ అమ్మవారి దేవస్థానికి అంటే 27వ తేదీ ఉదయం తీసుకెళతారు

ప్రత్యేక శిడిబండ్లు

జాతర సందర్భంగా భక్తులు శిడిబండ్లను ఏర్పాటు చేయనున్నారు. శిడిబండి తొలుత బంటుమిల్లి రోడ్డులోని కృష్ణమ్మ బావి వద్ద వరకు వెళ్లి అక్కడ కొబ్బరికాయ కొట్టి గుడివాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఘటం గుడి వరకు వెళ్లి అక్కడ కూడా కొబ్బరికాయ కొడతారు. అనంతరం పాత కూరగాయల మార్కెట్ వద్ద పోతురాజు స్వామికి కొట్టిన బస్తాండు వరకు చేరుకుని శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానం వరకు వచ్చి అక్కడ కొబ్బరికాయలు కొట్టి చివరకు పైడమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకుంటారు.



పైడమ్మ అమ్మవారు

4న తెప్పోత్సవం

11 రోజులు పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ మహోత్సవాల్లో చివరి ఘట్టం తెప్పోత్సవం. జనవరి 4వ తేదీ గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో పైడమ్మ చెరువులో హంస వాహనంపై అమ్మవారిని ఊరేగింపుగా తెప్పొత్సవాన్ని నిర్వహించనున్నారు. 12న భారీ అన్నదానం జరగనుంది. గతంలో రెండు గంటలు మాత్రమే ఉచిత దర్శనం కల్పించిన దేవస్థానం వారు ఇప్పుడు నాలుగు గంటల సమయాన్ని కేటాయించారు. ఉదయం 6 గంటల నుంచి పది గంటల వరకు ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. ఆ తరువాత రూ.10, రూ.25 కేటాయించారు. ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో టీవీవీ మోహనరావు తెలిపారు.

వేడుకగా ధ్వజారోహణం

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రులో భూసమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థాన వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమం సోమవారం వేడుకగా వేద పండితులు నిర్వహించారు. స్వామివారు వివిధ వాహనాలపై పుర వీధుల్లో విహరించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. గ్రామ మాజీ సర్పంచి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి మేదర్‌బజార్‌కు చెందిన ఇంటూరి మురళీకృష్ణ, అతని మిత్రుడు నాగబాబు ఆదివారం బైక్‌పై పెనమలూరు వెళ్తుండగా పెనమలూరు సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడిపోవడంతో గాయాలు అయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇది అందరి ఆట..

- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా
- పెడన నియోజకవర్గంలో 16,683 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్

పెడన: యువతలో క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదే ఆడుదాం ఆంధ్ర. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాకారులను గుర్తించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 26 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. పెడన నియోజకవర్గలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 16,683 మంది క్రీడాకారులను రిజిస్ట్రేషన్ చేయించారు. వీరిలో 11,696 మంది పురుషులు, 4,987 మంది మహిళలు. పెడన మండలం నుంచి 5,221, బంటుమిల్లి 2,541, కృత్తివెన్ను 4,224, గూడూరు మండలం నుంచి 4,697 మంది క్రీడాకారులు పేర్లను నమోదు చేయించుకున్నారు. గ్రామ సచివాలయాలు ద్వారా పలు జెడ్పీహెచ్‌ఎస్‌లలో, వార్డు సచివాయాలు వారికి ఆడిటోరియం, కళాశాల, స్కూలు గ్రౌండ్లలో పోటీలు నిర్వహించనున్నారు. 'పెడన'లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని గూడూరు మండలంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని మంత్రి కార్యాలయం తెలిపింది.

కృత్తివెన్ను: మండలంలోని 17 సచివాలయాలందు ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు పాల్గొంటారని ఎంపీడీఓ బుచ్చిబాబు తెలిపారు.

అయోధ్య అక్షింతల గ్రామోత్సవం

బంటుమిల్లి: అయోధ్యలో జనవరి 22న జరగనున్న రామాలయ విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని సోమవారం బంటుమిల్లిలో అక్షింతల గ్రామోత్సవం నిర్వహించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీ పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో భక్తులు అక్షింతల చిత్ర పటాలు, కరపత్రాలు చేతపట్టి రామనామ స్మరణ చేస్తూ బంటుమిల్లి శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు సాగింది. ర్యాలీ అనంతరం పలు గ్రామాలకు చెందిన భక్తులు అక్షింతలను వారి వారి గ్రామాలకు తీసుకెళ్లారు. పండితులు హనుమంతచార్యులు, పవన్, సాయి వేద మంత్రాలతో ర్యాలీ జరిగింది. రామర్యాలీలో వీహెచ్‌పీ, బీజేపీ మండల కన్వీనర్లు ఇ.నాగబాబు, బి.ఆంజనేయులు, ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.



పాశ్చాపురం ఆలయం నుంచి ప్రారంభమైన అక్షింతల ర్యాలీ

వంద మందికి ఆహార ప్యాకెట్లు

చిలకలపూడి(మచిలీపట్నం): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే ఎర్నెస్ట్ ఆదివారం పలు ప్రాంతాల్లో పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. బస్టాండ్, నవకళ, పాత రైల్వేస్టేషన్, తెలుగుచర్చి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి ఆహారపొట్లాలను పంపిణీ చేసేవారు. మంచాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.